క్లుప్తంగా

జీఓ నంబర్ 85ను రద్దు చేయాలి

బిక్కవోలు: జీఓ నంబర్ 85ను నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు పీహెచ్‌సీల వైద్యులంతా మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి మాట్లాడుతూ జీఓ నంబర్ 85 వల్ల తమ మూడేళ్ల సర్వీసును నష్టపోయామన్నారు. ఇలా అకస్మాత్తుగా జీఓను మార్చడం అన్యాయమన్నారు. జీఓ 85ను రద్దు చేయమని శాసనసభ్యులకు అర్జీలు సమర్పించినా ఎటువంటి ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి భాద్రపద మాసం మంగళవారం సందర్భంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

మండల కో–ఆప్షన్ సభ్యుడు రత్నబాబు మృతి



వడిశలేరులో రత్నబాబు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

రంగంపేట: మండల పరిధిలోని వడిశలేరు గ్రామానికి చెందిన మండల కో–ఆప్షన్ సభ్యుడు, మండల పాస్టర్స్ ఫెలోషిప్ మాజీ అధ్యక్షుడు కె.రత్నబాబు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. రత్నబాబు భౌతిక కాయాన్ని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు కుసుమంచి కృష్ణంరాజు, మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు సందర్శించి నివాళులర్పించారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



ఎస్‌ఐ తోట కృష్ణసాయి

రంగంపేట: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మండలంలో ఎక్కడైనా అశ్లీల నృత్యాలు లాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తోట కృష్ణసాయి హెచ్చరించారు. మంగళవారం రాత్రి ఆయన మాట్లాడుతూ మండలంలో వినాయక చవితి మంటపాల వద్ద, నిమజ్జనం పేరుతో జరిగే ఊరేగింపుల సందర్భంగా ఎటువంటి అశ్లీల నృత్యాలు నిర్వహించడానికి లేదన్నారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు గ్రామస్తులు, ఉత్సవ కమిటీల సభ్యులు సహకరించాలని ఆయన కోరారు.

విశ్వనాథ సత్యనారాయణ జయంత్యుత్సవం

సీతానగరం: విశ్వనాథ వంటి మహాకవులు తెలుగు సాహిత్యానికి జ్ఞానపీఠ్ అవార్డు అందించడం మనకు ఎంతో గర్వకారణమని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అన్నారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతిని మంగళవారం ఆ కళాశాలలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి జీవం పోసిన మహనీయుడు విశ్వనాథ అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, సుబ్బారావు, డాక్టర్ మాధవ్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ సుధామయి, షేక్ మదీనా పాల్గొన్నారు.

నిమజ్జనానికి రేవుల్లో ఏర్పాట్లు

సీతానగరం: గణపతి విగ్రహాలను నిమజ్జనం చేయడానికి రేవుల్లో తగిన ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ కె.రమేష్, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు సమావేశం నిర్వహించారు. వంగలపూడి, ముగ్గళ్ల, మునికూడలి, జాలిమూడి రేవులను గణపతి విగ్రహాల నిమజ్జన చేయడానికి కేటాయించామన్నారు. ఆయా పంచాయతీల కార్యదర్శులు, వీఆర్వోలు రేవుల్లో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నానికి విగ్రహాల నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. రేవుల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఏఈ చంద్రమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్ పాల్గొన్నారు.

వ్యాపారానికి వరుణఘాతం

- తగ్గిన పండ్లు, కాయగూరల అమ్మకాలు
- ఆదాయం తగ్గిందని చిరు వర్తకుల ఆవేదన



పెద రాయవరం వద్ద ఏడీబీ రోడ్డు పక్కన వానలో తడుస్తూ కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న వ్యాపారి

రంగంపేట: అధిక వర్షాల వల్ల ఇప్పటివరకు వ్యాపారాలు అంతంత్రమాత్రంగా సాగేవి. ఇప్పుడు అల్పపీడనం పుణ్యమా అని దాదాపు వ్యాపారమే జరగకుండా పోయింది. ఇదీ మెట్ట ప్రాంతంలోని చిరు వ్యాపారుల దీన స్థితి. రాజానగరం మొదలు కాకినాడ వరకు ఏడీబీ రోడ్డు వెంబడి వివిధ గ్రామాలకు చెందిన రైతులు, వ్యాపారులు తమ పంటపొలాల దిగుబడులను రోడ్డు పక్కన అమ్ముకుని జీవనోపాధి పొందుతున్నారు. ఇటీవల వర్షాలను సైతం లెక్కచేయక బేరాల కోసం ఎదురు చూసేవారు. వర్షాలు తగ్గితే వ్యాపారం సాఫీగా సాగుతుందని ఆశించారు. ఇప్పుడు అల్పపీడనం కారణంగా కొనుగోలుదారులు రాకపోవడంతో చిరు వ్యాపారులకు మరింత ఇబ్బందికరంగా మారింది. తుపాను కారణంగా ఏడీబీ రోడ్డులో ప్రయాణాలు చేసేవారు గణనీయంగా తగ్గిపోయారు. దీంతో వ్యాపారం సాగడం లేదని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. కార్లలో ప్రయాణించేవారు మాత్రం కొద్దోగొప్పో కొంటున్నారు. వర్షం కురుస్తుండడంతో, కార్లలోంచి దిగడానికి ఇష్టపడక ముందుకు సాగిపోతున్నారు. వర్షాలకు పండ్లు, కూరగాయలు పాడైపోతున్నాయని చిరు వ్యాపారులు చెబుతున్నారు. తుపాను కారణంగా ఆదాయం సగానికి పడిపోయిందని, కుటుంబ పోషణ కష్టంగా మారిందంటున్నారు.

ఏడీబీ రోడ్డులో రంగంపేట మండలంలోని వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, రామేశంపేట, పెదపూడి మండలం పెద కొత్తూరు, మామిడాడ, బిక్కవోలు మండలం ఊలపల్లి, మెళ్లూరు, కొమరిపాలెంతో పాటు, రాజానగరం మండలం కానవరం తదితర ప్రాంతాల్లో చిరు వర్తకులు పండ్లు, కూరగాయలు విక్రయిస్తుంటారు. ఏడీబీ రోడ్డు వెంబడి దాదాపు 150 మంది ఇలాంటి వ్యాపారాలు చేస్తుంటారు. ఆయా గ్రామాలకు చెందిన పలువురు రైతులు, వ్యాపారులు సీజనల్‌గా పండే సీతాఫలం, నేరేడు, సపోట, బొప్పాయి, పనస, జామ, డ్రాగన్, తాటి, తదితర పండ్లు, వంగ, బెండ, దొండ, బీర, చిక్కుడు, కాకర, ఆగాకర, గోరు చిక్కుడు, ఆనప తదితర కూరగాయలతో పాటు, ఆకు కూరలు, తాటి ముంజులు, కొబ్బరిబొండాలు, బుర్రగుంజు, ఈతపండ్లను సైకిళ్లు, బైక్‌లపై తెచ్చి అమ్మకాలు సాగిస్తారు. ఎండకు ఎండి, వానకు తడిసి కుటుంబ పోషణ కోసం పాట్లు పడుతున్నామని చిరు వ్యాపారులు అంటున్నారు.

తుపానుతో తగ్గిన గిరాకీ



అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలు, గాలుల తీవ్రతకు వ్యాపారంలో గిరాకీ బాగా తగ్గిపోయింది. ఏడీబీ రోడ్డులో ప్రయాణాలు స్తంభించాయి. దీంతో వర్షం తగ్గినప్పుడు కాసింత వ్యాపారం జరుగుతోంది. అంతంత మాత్రంగానే ఆదాయం వస్తోంది.

– పి.దుర్గాప్రసాద్, పండ్ల వ్యాపారి, వెంకటాపురం

వ్యాపారానికి కష్టం



మొన్నటి వరకు అధిక వర్షాల కారణంగా వ్యాపారం అంతంతమాత్రంగానే సాగింది. ఇప్పుడు తుపాను కారణంగా మూడు రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో జనజీవనం స్తంభించింది. వ్యాపారం ఆశించినంత జరగడం లేదు. సరకు పాడైపోయి నష్టపోతున్నాం.

– బి.శ్రీను, వ్యాపారి, ఈలకొలను

సివిక్స్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పౌరశాస్త్రం (సివిక్స్) బోధించే గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చిక్కం దొరబాబు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 13 వరకూ గడువు ఉందన్నారు. సంబంధించి సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. వీరికి గంటకు రూ.150 చొప్పున గరిష్ఠంగా నెలకు రూ.10 వేలు జీతం చెల్లిస్తారన్నారు.

గణపతిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



పాలమూరులో వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: అనపర్తి మండలం పాలమూరు గ్రామంలో చందు యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వరసిద్ధి వినాయకుడిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సత్తి సూరారెడ్డి, వెంకటరెడ్డి, గుడాల వెంకట్రావు, కరి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

200 ఎకరాలలో వరి పంటకు పాక్షిక ముంపు



ముంపు ప్రాంతాలలో వరి పంటలను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

రాజానగరం: ఇటీవల కురిసిన వర్షాలకు కోరుకొండ మండలంలో సుమారు 200 ఎకరాల వరి పంట పాక్షికంగా ముంపు బారిన పడిందని దివాన్ చెరువు ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ తెలిపారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు మంగళవారం ఆయా ప్రాంతాలను పర్యటించి, రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఇటీవల కురిసిన వర్షాలకు సూరంపాలెం కాలువ పోటెత్తడంతో కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, రాఘవపురం, నాగంపల్లి, సూరంపాలెం, మునగాల, కోటికేశవరంలోని ఈ పరిస్థితి ఏర్పడింది. వాటిలో సుమారు 60 ఎకరాలు పూర్తిగా మునిగిపోయాయి, అక్కడక్కడా నేల కోతకు గురైంది. అయితే వర్షాలు తగ్గడంతో ముంపు నీరు నెమ్మదిగా తీసేస్తుంది కాబట్టి రైతులు ఆందోళన చెందనవసరం లేదని వ్యవసాయాధికారులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు

ముంపు బారిన పడిన పొలాలలో వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. ప్రస్తుతం ఈ ప్రాంతాలలో అక్కడక్కడా మాగుడు తెగులు సోకినట్టుగా గుర్తించామని, దీని నివారణకు హెక్సాకోనాజోల్ 2 మిల్లీ లీటర్లు లేదా ప్రాపికోనాజోల్ ఒక మిల్లీలీటర్ లేదా 0.4 గ్రాముల ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్, టెబ్యూకానోజోల్ లేదా అజాక్సీస్ట్రోబిన్ 1.5 మిల్లీలీటర్‌ను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ముంపు నీరు నుంచి తేరుకున్న పొలాలలో ఎకరాకు 20 కిలోల పొటాష్‌తో పాటు 20 కిలోల యూరియా చల్లుకోవాలన్నారు. ఎండ తీవ్రత పెరిగే కొద్దీ ఆకుముడత తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున దాని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కోరుకొండ ఏడీఏ బీకే మల్లికార్జునరావు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి, వ్యవసాయాధికారి గౌరీదేవి, ఆత్మ ప్రాజెక్టు ఏటీఎం జె.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, అనపర్తి నియోజకవర్గం

పెదపూడి: వరదలు వస్తాయని ముందుగా హెచ్చరికలు ఉన్నా సరైన జాగ్రత్తలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలు వస్తాయని ముందే తెలిసినా అక్కడి ప్రజలను అప్రమత్తం చేయలేదని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ఇల్లు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ నగరం పైకి వదిలేశారన్నారు. ఆఖరికి వరద తర్వాత బాధితులను ఆదుకోవడంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. టీడీపీ నేతలు బాధితులను ఆదుకోవడం మాని బురద రాజకీయాలు చేస్తున్నారన్నారు. వర్షం, వరద తగ్గుముఖం పట్టిన తర్వాత కూడా కనీస వసతులకు నోచుకోని దుస్థితి నెలకొందన్నారు. వరద వచ్చి 10 రోజులు గడుస్తున్నా బాధితులకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఆహారం అందడం లేదన్నారు. ప్రచార ఆర్భాటాల వల్ల సహాయక చర్యల్లో సమన్వయ లోపం నెలకొందన్నారు. గతంలో జగనన్న వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడంతో కరోనా వంటి మహమ్మారినే సమర్థవంతంగా తిప్పిగొట్టగలిగామని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వరద బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

30 శాతం ఇన్ సర్వీస్ కోటాను కొనసాగించాలి



రంగంపేట పీహెచ్‌లో నల్లబ్యాడ్జిలు ధరించి విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు వేణుశ్రీలక్ష్మి, సంకీర్తన



సీతానగరం పీహెచ్‌సీలో నల్ల బ్యాడ్జీ ధరించి వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ చైతన్య

సీతానగరం: ప్రభుత్వంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్లుగా పనిచేస్తున్న డాక్టర్లకు పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్ల కేటాయింపులో 30 శాతం ఇన్ సర్వీస్ కోటాను కొనసాగించాలని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఏవీకే చైతన్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల డాక్టర్ల అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) పిలుపు మేరకు పీహెచ్‌సీ డాక్టర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి రోగులకు వైద్యసేవలు అందించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ పీజీ చదవడానికి ఇన్సర్వీసు కోటాను 30 నుంచి 15 శాతానికి తగ్గించడం అన్యాయమన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి వైద్య సేవలు

రంగంపేట: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు జీఓ నంబర్ 85కి వ్యతిరేకంగా దశలవారీగా ఆందోళన చేపడుతున్నట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కోవిడ్–19 సమయంలో తమ జీవితాలను పణంగా పెట్టి సేవలందించినా ఇప్పుడు జీఓ 85 ద్వారా పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీఓ 85ను వెనక్కు తీసుకోవాలని ఆమె కోరారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం

సీతానగరం: సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదని, కూర్చుని ఆలోచిస్తే ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు కన్నూరి సతీష్‌బాబు అన్నారు. ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడారు. నేడు యువత తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. వారికి అవగాహన పెంచడమే ధ్యేయంగా ఫౌండేషన్ పనిచేస్తోందన్నారు. యువత చదువుతో పాటు మానసికంగా అభివృద్ధి చెందాలన్నారు.

పశ్చిమ ఏలేరుకు పెరిగిన వరద ఉధృతి

- ఆందోళనలో పరిసర గ్రామాల ప్రజలు
- ఏపీత్రయం వంతెన వద్ద గుర్రపు డెక్క తొలగింపు పనులు



ఏపీత్రయం వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పశ్చిమ ఏలేరు కాలువ



ఏపీత్రయం శివారులో కాలువ గట్టుపై ఉన్న కుటుంబాలతో మాట్లాడుతున్న తహసీల్దార్ సీతాపతి



ఏపీత్రయం వంతెన వద్ద గుర్రపు డెక్కను తొలగిస్తున్న కూలీలు

పెదపూడి: పెదపూడి మండలంలో కరకుదురు, ఏపీత్రయం గ్రామాల మధ్యలో ఉన్న ఏపీత్రయం వంతెన వద్ద గల పశ్చిమ ఏలేరు కాలువకు వరద ఉధృతి మంగళవారం మరింత పెరిగింది. సోమవారం కంటే వరద ఉధృతి 8 అడుగుల మేర పెరిగినట్లుగా అధికారులు ధ్రువీకరిస్తున్నారు. దీంతో కాలువ సమీపంలోని రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పశ్చిమ ఏలేరు ఉధృతి పెరగడంతో పాటు ఏపీత్రయం వంతెన వద్ద గుర్రపు డెక్క భారీగా చేరుకుంది. దీంతో కాలువలో నీరు దిగువ ప్రాంతాలకు నెమ్మదిగా ప్రవహిస్తుంది. ఈ వంతెన వద్దకు ఒక వైపు బిక్కవోలు నుంచి మరోవైపు సామర్లకోట మీదుగా ఏలేరు కాలువ నుంచి నీరు వస్తుంది. ఈ రెండు ఏపీత్రయం వంతెన వద్ద కలవడంతో నీరు వెనక్కి తన్నుతోంది. దీంతో రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు, ఇందిరమ్మ కాలనీ, పీఏసీసీఎస్ సమీపంలోని కొత్త కాలనీలకు వరదనీరు చేరే అవకాశముంది. మంగళవారం రాత్రికి నీటి ఉధృతి పెరిగితే ఆయా గ్రామాల్లోని కాలనీలు, వరి పొలాలు నీటి ముంపునకు గురయ్యే అవకాశముంది.

అప్రమత్తమైన అధికారులు

వరద ఉధృతి పెరిగిన నేపథ్యంలో తహసీల్దార్ సీతాపతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణ రెడ్డి తదితర అధికారులు అక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మంగళవారం ఏపీత్రయంలో పర్యటించిన తహసీల్దార్ సీతాపతి మాట్లాడుతూ బుధవారానికి వరద మరింత పెరిగొచ్చని, దీనివల్ల పంట పొలాలు నీట మునిగే అవకాశముందన్నారు. అందుకే రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు గ్రామాల్లో రైతులతో మాట్లాడి అప్రమత్తం చేశామన్నారు. ఏపీత్రయం వంతెన వద్దకు చేరుతున్న గుర్రపు డెక్క, తూటికాడను ఎప్పటికప్పుడు తొలగించే పనులు జరుగుతున్నాయన్నారు. ఏపీత్రయం గ్రామం శివారు జమ్ములమ్మ గుడి సమీపంలో పశ్చిమ ఏలేరు కాలువ గట్టుపై ఉన్న పది కుటుంబాలను గుడి సమీపంలోని ఒక భవనంలోకి తరలించి అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. రామేశ్వరం, ఏపీత్రయం గ్రామాల మధ్యలో గల ఏలేరు కాలువకు బలహీనంగా ఉన్న గట్టు ప్రాంతాలను గుర్తించి జేసీబీ సహాయంతో పటిష్ఠం చేస్తున్నామన్నారు.

పంచాయతీలకు ఆవస్థలు తప్పవా!

- పూడికతీత పనులతో అదనపు భారం
- కార్పొరేషన్ చేపట్టదన్న కమిషనర్



హుకుంపేట వద్ద ఆవ కాలువలో జేసీబీతో గుర్రపుడెక్కను తొలగిస్తున్న సిబ్బంది



ఆవ కాలువలో కలుపు మందు కొడుతున్న పంచాయతీ కార్మికుడు

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఏడాదీ వర్షాకాలం ముందు ఆవ కాలువలో పూడికతీత పనులను నగరపాలకసంస్థ చేపట్టేది. ఇప్పుడు ఆ బాధ్యత ఆవకాలువ పరిధిలోని పంచాయతీపై మోపింది. ఈ మేరకు నగరపాలకసంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీనివల్ల సదరు గ్రామ పంచాయతీలపై అదనంగా భారం పడనుంది. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి మురుగు నీరు, వర్షం నీరు హుకుంపేటలోని ఎస్‌టీ ప్లాంట్‌కు చేరుతుంది. అక్కడ మురుగునీటిని శుద్ధి చేసి హుకుంపేట, బొమ్మూరు ఆవకాలువ ద్వారా ధవళేశ్వరం సాయిబాబాగుడి వద్ద గోదావరిలో కలుస్తుంది. ఇప్పటి వరకూ ప్రతి ఏడాదీ వర్షాకాలం ముందు నగరపాలకసంస్థ అధికారులు జేసీబీలతో హుకుంపేట, బొమ్మూరు, ధవళేశ్వరం గ్రామాల మీదుగా వెళ్లుతున్న ఆవ కాలువలోని గుర్రపుడెక్క, పూడికను తీయించేవారు. గోదావరి ఉధృతంగా ఉన్న సమయంలో ఆవకాలువ నుంచి గోదావరిలో కలిసే నీరు వెనక్కి ప్రవహిస్తే.. ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద భారీ మోటార్లు ఏర్పాటు చేసి ఆ నీటిని గోదావరిలో తోడించే ఏర్పాట్లు చేశారు.

పంచాయతీలదే బాధ్యత

ఆవ కాలువ పూడికతీత పనులను నగరపాలకసంస్థ చేపట్టదని, ఆ పనులను గ్రామ పంచాయతీలే చేపట్టాలని ఇటీవల కమిషనర్ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల గోదావరి ఉధృతంగా ఉన్న సమయంలో ఆవకాలువ పరిశీలనకు వచ్చిన కలెక్టర్ పి.ప్రశాంతికి మండలస్థాయి అధికారులు ఆవ కాలువ పూడికతీత పనులు పంచాయతీలు చేపడితే అదనపు భారం పడుతుందని వివరించారు. దీంతో కలెక్టర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధుల నుంచి విడుదల చేస్తానని హామీ ఇచ్చారు.

అదనపు భారం

హుకుంపేట పంచాయతీ పరిధిలోని ఆవ కాలువలో పూడికతీత పనులను పంచాయతీ అధికారులు చేపట్టారు. గుర్రపుడెక్కను జేసీబీల సహాయంతో తొలగించాలంటే లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ముందుగా గుర్రపుడెక్కను కలుపుమందు కొట్టి అవి ఎండిపోయిన తరువాత అనంతరం జేసీబీ సహాయంతో తొలగించాలి. ఆవ కాలువపై ఆక్రమణలను తొలగించినప్పటికీ ప్రతి ఏడాది గుర్రపు డెక్క వస్తూనే ఉంటుంది. దీన్ని తొలగించాలంటే అదనపు భారం పడుతుందని అధికారులు వాపోతున్నారు. నగరపాలకసంస్థ పరిధిలోని మురుగు నీరు, వర్షం నీరే ఆవ కాలువలో అధికంగా ప్రవహిస్తుందని, కాబట్టి నగరపాలక సంస్థ పూడికతీత పనులు చేపట్టాలని మాజీ ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

17న అనంత పద్మనాభస్వామి వ్రతం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిన్నవెంకన్నబాబు తదితరులు

సీటీఆర్ఐ: గాడాలలోని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో ఈ నెల 17వ తేదీన 108 జంటలతో అనంత పద్మనాభస్వామి వ్రతం నిర్వహిస్తున్నామని పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు స్వామీజీ తెలిపారు. స్థానిక జయశ్రీ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్వామీజీ మాట్లాడుతూ అరణ్యవాసం చేస్తున్న పాండవులకు శ్రీకృష్ణుడు ఈ వ్రతాన్ని ఉపదేశించాడన్నారు. ఈ వ్రతం ఆచరించి రక్ష ధరిస్తే అద్భుత ఫలితాలు కలుగుతాయని తెలిపారు. పీఠం జాతీయ సహాయ కార్యదర్శి మద్ది శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్ మాట్లాడుతూ ఆసక్తి కలవారు 86888 88999 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూచిమంచి అనంత పద్మనాభశర్మ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో మాధవరావు

కడియం: ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని పురుగు మందులు, ఎరువుల షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఏవో మాట్లాడుతూ ఎమ్మార్పీకి మించి విక్రయాలు జరపకూడదన్నారు. స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై రైతులకు తెలిసే విధంగా నమోదు చేయాలన్నారు. నిబంధనల మేరకు వ్యవహరించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఏడీ శ్రీనివాసరెడ్డి, కడియం ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని పాల్గొన్నారు.